# కవయిత్రులకు క్రమేపీ పెరుగుతున్న ఆదరణ

## వెబ్‌సైట్ ఆవిష్కరణ సభలో వక్తలు

(ఆంధ్రప్రభ ప్రతినిధి)

**హైదరాబాద్,ఫిబ్రవరి 26 :** తెలుగుసాహిత్యం గురించి ముఖ్యంగా కవయిత్రుల సాహిత్యసేవల గురించి ప్రపంచానికి తెలియచెప్పేందుకు సాంకేతిక పరిజ్ఞానం విస్తృతంగా దోహదపడుతుందని జ్ఞానపీఠ అవార్డు గ్రహీత ఆచార్య సి.నారాయణరెడ్డి అన్నారు. పొట్టిశ్రీరాములు తెలుగువిశ్వవిద్యాలయంలోని విజ్ఞాన సర్వస్వ కేంద్రం ప్రతినిధి డాక్టర్ మాదిరాజు కనకదుర్గ రూపొందించిన తెలుగు కవయిత్రుల వెబ్‌సైట్‌ను గురువారం ఎన్టీఆర్ కళామందిరంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ఆవిష్కరించి ప్రసంగించారు. పుస్తకాలు చదివే అలవాటు లేని వారికి అందుబాటులో లేనివారికి కనకదుర్గ రూపొందించిన వెబ్‌సైట్ ద్వారా తెలుగు సాహిత్యంలోని ప్రధాన ఘట్టాలపై తక్షణ అవగాహన పొంది అవకాశం ఉందని, ఇలా అందివచ్చిన సౌకర్యాన్ని పాఠకులు వినియోగించాలని కోరారు. సభకు అధ్యక్షత వహించిన తెలుగువిశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య అనుమాండ్ల భూమయ్య మాట్లాడుతూ తెలుగుసాహిత్యంలో కవయిత్రులు ప్రభావ వంతమైన పాత్రను పోషించారని ఈ వెబ్‌సైట్‌ను రూపొందించడంలో కనకదుర్గ విశేషకృషి చేశారన్నారు. రచయిత్రులకు తగిన స్థానం లభించడం లేదన్న ఆవేదన వ్యక్తం చేస్తూ, రచయిత్రులు, కవయిత్రుల కృషిని రేపటి తరానికి తెలియచెప్పడానికి, భావిపరిశోధనలకు ఈ వెబ్‌సైట్ ఎంతో దోహదకారిగా ఉండగలదన్నారు. కనకదుర్గ ఈ వెబ్‌సైట్ ద్వార సామాన్య పాఠకులకు కూడా తెలుగు సాహిత్యాన్ని అందుబాటులో ఉంచడానికి చేస్తున్న ప్రయత్నానికి ఇతర కవయిత్రులు, రచయిత్రులు ఎప్పటికప్పుడు ఆమెకు సహకరించాలని భూమయ్య కోరారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న డాక్టర్ సి.మృణాళిని మాట్లాడుతూ వెబ్‌సైట్‌కు ప్రామాణికత తప్పనిసరి అని స్పష్టం చేశారు. భారతీయ సాహిత్యరంగంలో ఇది ఒక విలక్షణమైన వెబ్‌సైట్ అని వెల్లడిస్తూ,వెబ్‌సైట్‌కు కేవలం విస్తృతి మాత్రమే సరిపోదని లోతు ఉండాలని అన్నారు.



కవయిత్రుల వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్న సి.నారాయణరెడ్డి

ఒక బృందం చేయాల్సిన పనిని కనకదుర్గ ఒక సాహిత్యాభిమానిగా ఈ వెబ్‌సైట్‌ను రూపొందించడంలో ఎన్నో ప్రతిభంధకాలను చవిచూశారని ఆమె అన్నారు. అయితే ఈ వెబ్‌సైట్ ద్వారా తెలుగుసాహితీశోభనం నేటి తరం ముఖ్యంగా వర్ధమాన రచయిత్రులు చక్కని సమాచారాన్ని పొందే వీలుందని ఆమె వివరించారు. ప్రత్యేక అతిధిగా పాల్గొన్న వనితా టీవి ఛీఫ్ ఎడిటర్ ఓల్గా మాట్లాడుతూ, పుస్తకం కంటే ఈ వెబ్‌సైట్ గొప్పదని, పుస్తకాలలో ఉన్న సమాచారం కంటే ఈ వెబ్‌సైట్‌లో ఉంచిన సమాచారం విస్తృతమైనదని అన్నారు. స్త్రీల రచనలను పట్టించుకొని స్థితి నుండి వెబ్‌సైట్‌ను రూపొందించిస్థాయికి కవయిత్రులు ఎదగడం హర్షణీయమని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో కొండవీటి సత్యవతి,ఆచార్య టి.గౌరిశంకర్, ఆచార్య కె.ఆనందన్ తదితరులు పాల్గొనగా వెబ్‌సైట్ రూపకర్త మాదిరాజ్ కనకదుర్గ తన స్పందన ప్రసంగంలో ఈ వెబ్‌సైట్‌ను రూపొదించడంలో తనకు సహకరించిన ప్రతి ఒక్కరికి వినయపూర్వక నమస్కారాలు తెలియజేశారు. తెలుగుసాహిత్య రంగానికి సంబంధించిన మరింత సమాచారాన్ని ఎప్పటికప్పుడు తన వెబ్‌సైట్‌లో పాఠకుల అభిలాషకు అనుగుణంగా ఉంచుతానని ఆమె హామీ ఇచ్చారు.